క్లుప్తంగా

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు



అలంకరణలో దుర్గాదేవి

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయంలో వెలిసిన దుర్గాదేవి అమ్మవారికి శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనల అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు మహామంగళారతి ఇచ్చారు.

సబ్సిడీపై కందుల పంపిణీ

చిలమత్తూరు: ఖరీఫ్‌లో సాగు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై కందులు సరఫరా చేస్తున్నట్లు ఏఓ వంశీకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 4 కేజీల కందులు (ఎల్‌ఆర్‌జీ–52 రకం) బ్యాగు ధర 559.20 కాగా.. సబ్సిడీ రూ.167.7 పోను రూ.391.5 లకే ఇవ్వనున్నట్లు తెలిపారు. రాయితీపై కంది విత్తనాలు కావాల్సిన రైతులు స్థానికంగా ఉండే రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



శాంతరాజు (ఫైల్)

పావగడ: తాలూకాలోని కెంచమ్మనహళ్లిలో బాల మిత్ర ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శాంతరాజు(56) గుండెపోటుతో గురువారం రాత్రి మృతి చెందాడు. బూదిబెట్ట గ్రామంలో రాత్రి తీవ్ర గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బూదిబెట్ట గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. ఉపాధ్యాయుడి మృతి పట్ల స్థానిక బీఈఓ ఇంద్రాణమ్మ తదితర విద్యాశాఖ అధికారులు తీవ్ర సంతాపం ప్రకటించారు.

ఆగ్నేయ ఎమ్మెల్సీగా శ్రీనివాస్



ఎమ్మెల్సీ శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: స్థానిక ఆగ్నేయ ఉపాధ్యాయుల క్షేత్రం ఎమ్మెల్సీగా డీటీ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. గురువారం రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డీటీ శ్రీనివాస్ రెండవ ప్రాధాన్యత ఓట్లలో గెలు పొందాడు. హిరియూరు మాజీ ఎమ్మెల్యే పూర్ణిమ భర్త డీటీ శ్రీనివాస్ గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అలాగే బీజేపీ అభ్యర్థి వైఏ నారాయణస్వామి 4 పర్యాయాలు గెలుపొందగా ఈ సారి ఓడిపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి డిటి శ్రీనివాస్ గెలుపు పట్ల స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదేశ్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ శంకరరెడ్డి తదితరులు హర్షం ప్రకటించారు.

విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న విద్యార్థినులు

పావగడ: తాలూకా లోని పది, పీయూసీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులకు పావగడ సావిత్రి బాయి పూలే సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు దుర్గమ్మ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలె సంఘం మహిళల పురోగతికి పాటు పడుతుందన్నారు. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరం పది, పీయూసీ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఆడపిల్లలకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నామన్నారు. ఇదే రీతి రాబోయే రోజుల్లో మహిళా ప్రగతికి కృషి చేస్తామన్నారు. బీఈఓ ఇంద్రాణమ్మ మాట్లాడుతూ సన్మానిత విద్యార్థినులు భవిష్యత్తు లో మరిన్ని సాధనలు చేయాలన్నారు. సంఘం కార్యదర్శి లక్ష్మిదేవి, ట్రెజరర్ శాంతకుమారి, పదాధికారులు సావిత్రమ్మ, అర్చన, బీఆర్పీ వెంకటేశ్ తదితర విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ గాంధీ (32) మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని కురుబవాండ్లపల్లికి చెందిన గాంధీ వ్యక్తిగత పనుల నిమిత్తం మిత్రుడు భూషణతో కలిసి కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి వెళ్లి తిరిగి సొంతూరుకు వెళ్తుండగా, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గాయపడిన గాంధీని బెంగళూరులోని ఓ ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



అమరాపురం: బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం



అగళి: బహుమతులను చూపుతున్న విద్యార్థులు



హిందూపురం టౌన్: మాట్లాడుతున్న అధికారులు

అమరాపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఉపాధ్యాయులు నరసింహమూర్తి, మారుతి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయంలో శాఖాధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో గత మే 5 నుంచి జూన్ 7 వరకూ విద్యార్థులకు పుస్తక పఠనం, వ్యాసరచన పోటీలు, ఉక్త లేఖనం, చిత్ర లేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుసక్త పఠనం అలవర్చుకోవాలన్నారు. నాగరాజు, వీరక్యాతరాయ, మారెన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటవస్తువులు, పెన్నుల పంపిణీ..

రొళ్ల: స్థానిక గ్రంథాలయ ఆవరణలో గత నెల 17న ప్రారంభమైన వేసవి శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి ప్రతాప్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు అట్టలు, పెన్నులు ఇతరాత్ర విద్య సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అగళి ఇన్‌చార్జ్ గంథ్రాలయ అధికారి బొజ్జేనాయక్, మురళి, పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి, గ్రంథాలయ సిబ్బంది గోపాల్ పాల్గొన్నారు.

అగళి: విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని ఇంచార్జ్ గ్రంథాలయాధికారి మూడే బొజ్జే నాయక్ సూచించారు. వేసవి శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా శుక్రవారం వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది చిక్కనాగప్ప విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. గ్రంథాలయాధికారి మల్లికార్జున మాట్లాడుతూ.. శిక్షణలో భాగంగా కథలు చెప్పడం, వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అతావుల్లా, ఉపాధి జేఈ శ్రీనివాసులు, చిత్రలేఖన ఉపాధ్యాయుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోండి

హిందూపురం టౌన్: విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయాలకు వచ్చి పుస్తకపఠనం అలవర్చుకోవాలని ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్ అధ్యక్షత వహించగా.. ముఖ్య అతిథులుగా ఎంఈఓలతో పాటు ప్రభుత్వ ఆస్పత్రి మాజీ చైర్మన్ వెంకట స్వామి పాల్గొన్నారు. తొలుత సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని, విజ్ఞానానికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. గ్రంథాలయాలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు శ్రీశైలం, అబ్జల్ బాషాను సన్మానించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.



రొళ్లలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి ప్రతాప్

చిత్రలేఖనంపై పోటీలు

రొద్దం: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. 21 రోజుల విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అతిథి, విరామ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను అవకాశాలు అందిపుచ్చుకోవాలని అన్నారు.



రొద్దంలో బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక



హేమంత్

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి హేమంత్ నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీధర్ శుక్రవారం తెలిపారు. నాలుగేళ్ల పాటు విద్యార్థికి ఏడాదికి రూ.12,500 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. విద్యార్థి ఎంపికపై ఉపాధ్యాయులు హర్షంవ్యక్తం చేశారు.

రోటరీ క్లబ్ సేవలు ఆదర్శం



ఆర్టీసీ బస్టాండ్‌లో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ డీఎం శ్రీకాంత్, రోటరీ క్లబ్ సభ్యులు

హిందూపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రూ.1.8 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆర్టీసీ డిపో మేనేజర్ పి.శ్రీకాంత్ ప్రారంభించారు. తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కోసం రోటరీ క్లబ్ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపట్టేందుకు రోటరీ క్లబ్ కృషి చేస్తోందని అధ్యక్షుడు గిరిధర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ చెన్నప్పరెడ్డి, రోటరీ క్లబ్ సెక్రటరీ కల్యాణ్ కుమార్, అసిస్టెంట్ గవర్నర్ తిమ్మారెడ్డి, ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్రీధర్ గౌడ్, ట్రేజర్ స్పాన్సర్ నంబూరి సుమంత్ రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలపై చర్యలు తీసుకోండి



నారాయణ పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని నారాయణ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నారాయణ పాఠశాల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ.. పట్టణంలోని నారాయణ పాఠశాల ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ.. ఇష్టం వచ్చినట్లు ఫీజులు పెంచుతోందన్నారు. పాఠశాలలోనే పాఠ్యపుస్తకాలు కొనాలని నిబంధన పెట్టి అమ్ముతోందన్నారు. అయినప్పటికి విద్యాశాఖ అధికారులు చూస్తూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. నారాయణ పాఠశాలలో తల్లిదండ్రులకు ఆకర్షణీయమైన పేర్లను టెక్నో, ఒలింపియాడ్ ఐఐటీ చెబుతూ యూకేజీకి రూ.30 వేలు నుంచి 10వ తరగతికి రూ.50 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, టై, బెల్టు ఇతర సామగ్రి ఇక్కడే కొనాలని నిబంధన పెట్టి రూ.6 వేల నుంచి 10 వేల వరకు అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల నోటీసు బోర్డులో ఫీజుల వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు. నోటీసు బోర్డులో ఫీజుల వివరాలు ఎక్కడ పొందుపరచలేదన్నారు. అంతేకాకుండా కనీసం విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, క్రీడా మైదానం కూడా లేదని తెలిపారు. నారాయణ పాఠశాలను విద్యాశాఖ అధికారులు సందర్శించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు చంద్రశేఖర్, జస్వంత్, హర్ష కుమార్, హసేన్, సాయి, శ్రీనివాసులు, మణికంఠ, బాబావలి తదితరులు పాల్గొన్నారు.

మరుకుంటపల్లిలో డీఎస్పీ విచారణ

సోమందేపల్లి: మండలంలోని మరుకుంటపల్లిలో డీఎస్పీ బాజీజాన్ సైదా శుక్రవారం విచారణ చేశారు. తమను కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారని టీడీపీ కార్యకర్తలు కుమార్, నాగేంద్రమ్మ దంపతులు ఈనెల 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిపై డీఎస్పీ గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా, తమపై అక్రమ కేసును బనాయించారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సోమశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, రాజమ్మ తెలిపారు. తమ ఇళ్ల ముందే టపాసులు పేల్చి తిరిగి ఎస్సీ,ఎస్టీ కేసు పెట్టడం సరికాదని మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసప్ప అన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

గోరంట్ల: మండలంలోని గంగాదేవపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత శుక్రవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు లేకపోవడంతో గ్రామస్తులతో ఆరాతీశారు. అంగన్‌వాడీ కేంద్రం సక్రమంగా నిర్వహించలేదని, పౌష్టికాహారం అందించకపోవడంతో పిల్లలను పంపలేదని గ్రామస్తులు సూపర్‌వైజర్ దృష్టికి తీసుకెళ్లారు.

నేడు విద్యుత్ అంతరాయం

రొద్దం: మండలంలోని పెద్దమంతూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి, మాజీ సమన్వయకర్త వేణుగోపాల్‌రెడ్డి, నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని పార్టీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, నాయకురాలు మధుమతిరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన గ్రామ, వార్డు స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్రంలో గెలుపొందిన కూటమిని అభినందించారు. రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలు ఏ విధంగా వచ్చాయో అందరూ ఒక్కసారి ఆలోచించాలన్నారు. ఢిల్లీ పెద్దలు అందరూ కలిసి ఏమి చేశారో ఆ దేవుడికి తెలియాలన్నారు. హిందూపురం నియోజకవర్గంలో ముదిరెడ్డిపల్లిలోని 28వ బూత్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒకే ఒక్క ఓటు పోలైంది. ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఆ బూత్‌లో కనీసం మా ఏజెంట్లు నలుగురు ఉంటారు. ఆ నలుగురి ఓట్లు కూడా పోల్ కాలేదా అని అనుమానం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని కౌంటింగ్ రోజు అధికారులను ప్రశ్నిస్తే.. ఎక్కడో తప్పు జరిగిందని చెప్పారని గుర్తు చేశారు. అలా జరగలేదు అనడానికి మీ దగ్గర సాక్ష్యం ఉందా అని ప్రశ్నించారు. దీన్ని బట్టి చూస్తే ఇంకా ఎన్ని బూత్‌లలో ఇలా చేసి ఉంటారో ఆ దేవుడికే తెలియాలన్నారు. మీరు నిజాయితీగా గెలిచి ఉంటే అభినందనలు. అన్యాయంగా గెలిచింటే ఆ దేవుడు చూసుకుంటాడన్నారు. ఈ ఎన్నికల్లో ఈవీఎంలను ట్యాపింగ్ చేసి వేసిన ఓట్లు 30 శాతం వైఎస్సార్ సీపీకి 70 శాతం టీడీపీకి పడేలా చేశారని ఆరోపించారు. ఒక్క హిందూపురంలోనే కాదు.. రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై టీడీపీ వారు దాడులు చేస్తున్నారని తెలిపారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. గెలిచిన వారు హిందూపురం అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు బాలాజీ మనోహర్, కన్వీనర్లు రాము, మన్సూర్, ఎంపీపీ రత్నమ్మ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, ఎంపీపీ, పట్టణ, మండల నాయకులు ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

హిందూపురం: మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీని ఎన్డీఏ కూటమి ఎన్నుకోవడం శుభసూచికమని బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు రవితేజారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ సెంట్రల్ సీడ్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్‌లు, కౌన్సిలర్ అంజలిరెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, బిజెపి సీనియర్ నాయకులు అంజన్‌రెడ్డి, గోవిందరెడ్డి, మండల అధ్యక్షులు నగేష్, నరసింహ మూర్తి, హరినాథ్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలగోపాల్, మారుతి, సంతోష్ రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కొత్తపాళ్యం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

రొళ్ల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి కోరారు. శుక్రవారం కొత్తపాళ్యం, అగ్రహారం వద్రహట్టి, మల్లసముద్రం, హెచ్‌టీవద్రహట్టి, హెచ్‌టీ హళ్లిలోని అంగనవాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో రికార్డులు తనిఖీ చేసి చిన్నారులు, గర్భిణులు, బాలింతల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు మూడేళ్ల పైబడిన చిన్నారులను అంగనవాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. అంగనవాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు ప్రతి 15 రోజులకోసారి పౌష్టికాహారంతో కూడిన సంపూర్ణ పోషణ ఆహార కిట్లను అందిస్తామన్నారు. ఇదిలా ఉండగా స్థానిక వైకేపీ కార్యాలయం ఆవరణలో సూపర్‌వైజర్ సన్నమ్మ అంగనవాడీ వర్కరకు నెలవారి సమావేశాన్ని ఏర్పాటు చేసి కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు.

పౌష్టికాహారం అందజేత

లేపాక్షి: స్థానిక పీహెచ్‌సీకి సుదూరు ప్రాంతాల నుంచి వైద్య పరీక్షల కోసం వస్తున్న గర్భిణులకు శుక్రవారం అన్నదానం చేశారు. భోజనం బాగుందా? రచికరంగా అందజేస్తున్నారా అని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని శాశ్వతంగా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. వైద్యాధికారి రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది సుబ్రహ్మణం, ప్రసాద్ పాల్గొన్నారు.

విస్తారంగా వర్షం.. రైతన్నల హర్షం



మడకశిరలోని శివాలయం వద్ద ప్రవహిస్తున్న వంక



పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లికి వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



అగళి మండలం మధూడిలో వర్షం కురుస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: నైరుతి రుతుపవనాలతో మండలంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. గురువారం రాత్రి నియోజకవర్గంలో 76.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. కురుస్తున్న వర్షాలకు చెక్ డ్యాంలు నిండి కుంటలు, చెరువులకు చేరుతున్నాయి. బోరుబావుల కింద మొక్కజొన్న, పత్తి విత్తనాలను రైతులు సాళ్ల పద్ధతిలో విత్తుతున్నారు. రైతులు ఖరీఫ్ పంట సాగు భూములు సిద్ధం చేసుకుంటున్నారు. బోరుబావుల కింద సాగు చేసిన పంటలకు వర్షం కారణంగా నీటి తడి పెట్టే అవసరం లేదని రైతులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం వద్ద వంక ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. సిద్ధగిరి సమీపాన గల పెద్ద వంక కురిసిన వర్షానికి ఉధృతంగా ప్రవహించింది.



వంక ద్వారా రొళ్ల చెరువుకు చేరుతున్న వర్షపు నీరు

అమరాపురంలో 48.4 మి.మీ వర్షపాతం

అమరాపురం: మండలంలో గురువారం రాత్రి 48.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రైతులు తమ సంతోషాన్ని వ్యక్త చేశారు. అలాగే శుక్రవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురవడంతో వేరుశనగ పంట సాగుకు రెండు మూడు రోజుల వరకు తేమ ఉంటుందని రైతులు తెలిపారు.

రొళ్లలో భారీ వర్షం

రొళ్ల: మండల వ్యాప్తంగా శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి రాత్రి 7 గంటలు దాటిన భారీ వర్షం కురిసింది. దీంతో రొళ్లకొండ, బసవన్నకొండ, అగ్రహారం కొండతో పాటు టీడీపల్లి జోగిగుట్ట కొండపై నుంచి వర్షపునీరు వంకలకు పెద్ద ఎత్తున చేరి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వంకల గుండా చెక్‌డ్యాంలు నిండి చెరువులకు నీళ్లు చేరడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో రైతులు ఎంతో సంతోషిస్తున్నారు.

అగళి: మండలంలో శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు చెరువు, కుంటలు, కందకాలల్లోకి నీరు చేరింది. పంటల సాగుకు ఈ వర్షాలు అనుకూలంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు.

రెవెన్యూ డివిజన్‌లో 210.4 మి.మీ వర్షపాతం

పెనుకొండ/పెనుకొండ రూరల్/రొద్దం: పెనుకొండ రెవెన్యూ డివిజన్‌లో శుక్రవారం ఉదయానికి 24 గంటల్లో 210.4 ఎంఎం వర్షపాతం నమోదయినట్లు డివిజినల్ గణాంకాధికారి మల్లికార్జున తెలిపారు. రొద్దం 32.6, మడకశిర 9.6, అమరాపురం 48.4, గుడిబండ 6.4, రొళ్ల 2.2, అగళి 10.2, పరిగి 4.2, పెనుకొండ 20.8, సోమందేల్లి 56.8, హిందూపురం 4.8, లేపాక్షి 6.2, చిలమత్తూరు 8.2 ఎంఎంగా నమోదయినట్లు తెలిపారు.

పరిగి: పరిగి, కొడిగెనహళ్లి తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం పడగా, మిగిలిన గ్రామాల్లో జల్లులు పడ్డాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లతో పాటు మట్టి రోడ్లన్నీ జలమయమయ్యాయి.